




# కృష్ణశాస్త్రీయం

## నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల



*'పల్లెటూరు, ఊరు పక్కన ఏరు, ఏటి ఒడ్డున వెదురు పొద*
*పొదచెంత పుంత, పుంతకు వెనుక మావి తోట, తోటకవతల*
*వరి చేల గట్టు... మనిషికీ, చెట్టుకీ, పిట్టకీ గట్టి చుట్టరికముందక్కడ'*

తన పుట్టిన వూరు గురించీ, అక్కడ మనిషికీ, ప్రకృతికీ వున్న చుట్టరికం గురించి కవి వ్రాసిన మాటలివి.

ఆ కవి తేనెలూరు భావ కవితా గుబాళింపుతో, మన మనసున మల్లెలు పూయించిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి.

1897 నవంబర్ 1న తను పుట్టిన తూర్పు గోదావరి జిల్లాలోని చంద్రపూరు అనే గ్రామం గురించీ, అక్కడే అప్పుడే తనకి ప్రకృతి అందించిన స్పందన గురించీ ఆయన వ్రాసిన మాటలే పైన వ్రాసినవి.

'ద్వారానికి తారామణి హారం, హారతి వెన్నెల కర్పూరం' అన్న మాటలకి అర్థం ఏమిటండీ అని అడిగాడొకాయన. ఆకాశానికి వెన్నెలతో కర్పూర హారతి పట్టిన ఆ కవి హృదయపు భావతరంగాలకి భాష్యం చెప్పటానికి ధైర్యం చాలక, మీరే ఆలోచించండి అన్నాను.

కృష్ణశాస్త్రిగారు మొదట్లో గ్రాంథికవాది అయినా, తరువాత సులభమైన పదాల సోయగాల మాలికలతో కవిత అల్లిన భావకవి. ఆయన కవితలు అర్థం చేసుకోవాలంటే కావలసింది కొంత భావుకత. ఆ పైన పూవుకీ తావికీ వున్న సంబంధం. ఆకాశానికీ మేఘానికీ వున్న అనుబంధం. వెన్నెల సారానికీ మధుర తుషారానికీ వున్న బాంధవ్యం. కొమ్మలకీ రెమ్మలకీ మధ్యన వున్న గుసగుసలు. అవేమీ తెలియకపోతే, నేరుతునో లేదో ప్రభూ నీ పాటలు పాడ అని కనులకు నిదుర రాక, మనసుకి శాంతి లేక బాధ పడనఖ్ఖరలేదు. ఆయన కవితలు చదివితే అవి తెలుసుకోవటమే కాదు, మన మనసున మల్లెల మాలలూగుతాయి. కన్నుల వెన్నెల డోలలూగుతుంది.

కృష్ణపక్షం, ఊర్వశి, పల్లకి వంటి కవితలు; శ్రీఆండాళ్ళు, ధనుర్దాసు, సాయుజ్యము, గుహుడు, శివక్షేత్ర యాత్రలాటి నాటికలు; తిరుప్పావు కీర్తనలు ప్రచురించారు. ఆయన వ్రాసిన 500 సినిమా పాటలు మేఘమాల పేరుతో ప్రచురించారు. కృష్ణ శాస్త్రీయ కవిత్వం ఆస్వాదించేవారి మనసుల్లో కలకాలం నిలిచే కొన్ని మచ్చు తునకలు:

ప్రియుడి తలను ఒడిలో పెట్టుకున్న ఒక ప్రియురాలు ఇలా అంటుంది...

*'సడి చేయకే గాలి, సడి చేయకే*
*బడలి ఒడిలో రాజు పవ్వళించెనే... సడి చేయకే*
*ఏటి గలగలకే ఎగసెనే తాను*
*ఆకు కదలికలకే అదరి చూసెలే*

*నిదుర చెదిరిందంటె నే నూరుకోనే.. '*

అంతేకాదు, ఆవిడ ప్రేమకి అంతు కనపడదు.

*'పండు వెన్నెల దిగి పాన్పు తేరాదే*
*నీడ మబ్బుల దాగు నిదుర తేరాదే*
*విరులనీవల పోలి విసరి పోరాదే.. '* అని వీచే గాలులని దబాయిస్తుంది.



ఆమె ప్రకృతి. అతడు పురుషుడు. వారి సంబంధం ఇలా వుంటుంది.

*'గలగలని వీచు చిరుగాలి కెరటమై*
*జలజలని పారు సెలపాటలో తేటవై*
*పగడాల చిగురాకు తెరచాటు తేటివై*
*పరువంపు విరిచేటి చిన్నారి సిగ్గువై.. '*

1925లో ప్రచురింపబడ్డ కృష్ణపక్షం నవ్య కవితకు నాంది అని ప్రశంసించబడింది. అందులో ఆయన ఇలా అంటారు.

*'తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ*
*జతగూడె దోబూచి సరసాల వాడి*
*దిగిరాను దిగిరాను దివి నుండి భువికి*
*నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు!'*

కోవిలకూ, మావి చిగురుకీ ఏమిటి సంబంధం?

*'మావి చిగురు తినగానే కోవిల పలికేనా*
*కోవిల గొంతు వినగానే మావిచిగురు తొడిగేనా*
*ఏమో ఏమవునో గానీ ఆమని ఈవని'*

చిలకమ్మ గోరువంక కలిసి కట్టుకున్న కలల గూడు చెదిరిపోయిందని కలత చెందిన సుకుమారులు కృష్ణశాస్త్రి.

'కృష్ణశాస్త్రి తన బాధను అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికించాడు' అన్నారు చలం, మహాప్రస్థానానికి వ్రాసిన యోగ్యతాపత్రంలో.

'అమృతం కురిసిన రాత్రి' వ్రాసిన తిలక్ ఆయన గురించి ఇలా అన్నారు, 'మల్లెపూల మీద పరుంటాడు, మంచి గంధం రాసుకుంటాడు, మరెందుకేడుస్తాడు?' అని.

రాధాకృష్ణుల ప్రేమ, అనురాగం, విరహ బాధ రూపంలో మన కళ్ళ ముందు ఇలా కదలాడతాయి.

*'మధురా నగరి సమీపంలో, మలయాయాత సమీరంలో*
*అర్థ నిమీలిత దృక్కులతో, ఎదురు చూతునోయీ!*
*కృష్ణా, నీకై ఎదురు చూతునోయీ!*
*వేణువు గాన విలాసంతో బిరానా వారాలా కరాలు సాతూ*
*దరికి చేరవోయీ, కృష్ణా, నీదాన రాధనోయీ!'* అంటుంది రాధ.

*'నీ మురళి మ్రోతలో వలపు పిలుపుందిరా, మ్రోగింపరా మురళి కృష్ణా!*
*సరికి వెన్నెలలోన కదలిపోయే యమున, కలకలా నవ్విందిరా కృష్ణా!*

అరమోడ్పు కనులలో పంచాశువులు జార, మైమరచి పోయిందిరా రాధిక'

'తలుపు తీయునంతలోనే, తత్తరమది ఏలనోయి

తలుపు తీతు వీలు చూసి తాళుము కృష్ణా'

'ఏలనంత తత్తరము, ఏలనంత భయము స్వామి

నినుగాక వేరొకరి నెట్టు తలువగలను కృష్ణా'

'పిల్లన గ్రోవూదుము... నా వుల్లము రంజిల్లగా... '

ఆయన కవిత్వంలో కనిపించేది లలిత పదాల జలజల రవళి, భావుకతతో నిండిన మలయామాత సమీరం. ఆయన, కవితా కొమ్మలలో కోయిలై కొసరి కొసరి కూశారు. రెమ్మలలో పూవై తావినిచ్చారు. అరవిరిసిన సుమదళాన సోయగమై దాగారు. సెలయేరుగా మారారు. కదలి నాట్యమాడారు.

దేవులపల్లి భావ కవిత్వం తప్ప ఏమీ రాయలేదా అనుకునేవారికి, ఆయన సమాజంలో సామాన్యుని గురించి, సమాజంలోని కుళ్ళుని గురించి, అధికారుల మదం గురించి వ్రాయటమే కాక, గాంధీగారి ప్రభావం, భారతీయత ఆయన కవితల్లో ఎలా ప్రభవించాయో ఈ కవితలు నిరూపిస్తాయి.

'ఒకని కులము, మతము నొక్కని,

ఒక్కని స్వార్థ, మొకని లోభ మావహింప

తెరలు పొరలుగాక తీయని చల్లని

నేలనేల బూదిపాలు చేయు!'

'ద్వేషమున్నచోట దేవుండు వెలయడు

మతులు గతులు తప్ప మతము లేదు

ఒక్క కంట ప్రేమ, ఒక కంట సత్యమ్ము

వెలుగ, జగతి శాంతి నిలుపవలయు!'

'బాగా ఏడు రాత్రీ! భయం లేదు, బిగ్గరగా ఏడు రాత్రీ!

గోల పెట్టు రాత్రీ, గుండె బాదుకో రాత్రీ!

వెళ్ళిపోయే లోగా వెక్కి వెక్కి ఏడు!

అప్పుడుగానీ అరుణోదయం కాదు!'

'అయ్యా అధికారులూ, ప్రభువులూ, సామంతులూ, శ్రీమంతులూ!

భగవంతునికి ఇదా మనం అర్పించుకునే ఉపద!

వంగిన నడుముని ఎలా సరిచేస్తారు మీరు?

కుంగిన భుజం ఎలాగున నిలబేడతారు మీరు?'

హాలికుడు: 'వేల శతాబ్దుల ప్రేగుల వల్ల వంగి పోయి

విశేష భూమీ భారం క్రింద క్రుంగిపోయి,

అణిగిపోయి, అణిగిపోయి అహరహమూ

నేల వైపే అదే పనిగా చూస్తుంటాడు!'

ఈ కవితల్లో శ్రీశ్రీ కనిపిస్తున్నాడు నాకు.

*'అంటరానితనము, ఒంటరితనము, అనాదిగా మీ జాతికి మూలధనము*
*ఇక సమభావం, సమధర్మం, సహజీవన మనివార్యం*
*తెలుసుకొనుట మీ ధర్మం! తెలియకుంటె మీ ఖర్మం!'*
*'నేలతో నీడ అన్నది నను తాకరాదని!'*
*'నాయనుంగు నేల నలుబది కోట్ల గుండియల అలలు నిండి నేడు పొంగు*
*నార్త శోకరార మరి నా గుండె దారులొరసి వెలికి పారు నిటుల!'*
*'సగము బట్టలేని సామాన్యుడు ఫకీరు, తాతయొకడు లోక ధాతయయ్యె!*
*ఏ మహత్తు లోన నిమిడించుకొన్నాడొ ఈ యుగాన, చిత్ర మీ జగాన!'*

*'నా కఠిన పాద శిలల క్రిందబడి నలిగిపోయె నెన్నెన్నియో మల్లెపూలు మున్ను...'* అన్న పదాలు కరణశ్రీగారిని కదిలించాయేమో అనిపిస్తుంది.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి 'జయ జయ జయ భారత జనయిత్రీ దివ్యధాత్రి!' అనే కవిత మన జాతీయగీతం అయే అవకాశాన్ని, చివరి క్షణంలో బెంగాలీ కంగాళీకి కోల్పోయింది. అదే జరిగి వుంటే జాతీయ పతాకంతో పాటూ, జాతీయగీతం కూడా భారత దేశానికి మన తెలుగువాళ్ళు ఇచ్చిందే అని గర్వంగా చెప్పుకుని వుండేవాళ్ళం.

కృష్ణశాస్త్రిగారి మురళి, ఆయన మూగపోయినా, కవితా గగన సీమలలో తేలి తేలి చల్లనైన పిల్లగాలిలా ఆనాటి నించీ ఈనాటి దాకా పాడుతూనే వుంది.

*'నాకు మాత్రము గానమున్నంత వరకు*
*చాలు చాలు నీ ప్రణయ నిశ్వాస మొకటె'*
*'మోసికొందువొ నా గీతముల నిన్ను*
*మూగవోదువొ రాయియైపోయి చిరము!'*
*'వెన్నెల మాటాడునా, వెదజల్లును పరిమళాలు'*
*'నా మరణశయ్య నేనే పరుచుకున్నాను*
*యిట నశించు నాకై చెమ్మగిల్లు నయనమ్ము లేదు!'*
*'పెరటిలో నుండి క్రొత్తగా విరిసిన విభాత*
*పరిమళం వచ్చి పలకరిస్తే ఔనని తలూపుతాను*
*కానీ గవాక్షంలోనికి రవ్వంత ఒదిగిన మావి కొమ్మ*
*చివర నిలచి కో అన్న వన ప్రియరావానికి*
*బదులు చెప్పలేను! ఇక బదులు చెప్పలేను'*

ఆకాశంలో మబ్బులున్నంత కాలం, వేకువ గాలి వ్రేళ్ళతో మన ముఖాలు నిమిరేంత కాలం, కోయిల గోరింకతో గుసగుసలాడినంత కాలం, పిల్లనగ్రోవి మధుమాస వేళ మనసులోని వేదనను గానంగా మార్చినంత కాలం, కృష్ణ శాస్త్రీయ కవిత్వం, మన మనసున మల్లెల మాలలు ఊగిస్తూ, రసజ్ఞుల హృదయాలలో చిరస్థాయిగా వుంటుంది.